క్లుప్తంగా

తిరుమలేశునికి కలువలతో అలంకరణ



కలువ పూల అలంకరణలో బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీకి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సామూహిక గీతా పారాయణ చేశారు. శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశుని కలువ పూలతో అలంకరించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ఘనంగా విశ్వకర్మ మహాయజ్ఞం



మహాయజ్ఞంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కునగరం : స్థానిక సెక్టార్ – 5 విశ్వకర్మ దేవాలయం ప్రాంగణంలో ఆదివారం గాయత్రి విశ్వకర్మ మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధనోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంట్‌కు ఒడిదొడుకులు తొలగిపోయి కార్మికులు, అధికారులు సంతోషంగా గడపాలని హోమం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదాన శిబిరంలో దాతలు

అక్కిరెడ్డిపాలెం : సామాజిక సేవలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జగ్గు జంక్షన్ వద్ద గాజువాక క్లబ్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక క్లబ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిక్కాల సత్యనారాయణ మాట్లాడుతూ వేసవిలో రక్తం నిల్వలు తక్కువగా ఉంటున్నందున ప్రాణాపాయ స్థితిలో వున్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. రక్తం అందక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని, రోగులకు అండగా ప్రాంతాల వారీగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, పలు అంశాలపై ప్రజా చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి వెంకటరెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి సత్యాల కోటేశ్వరరావు, గాజువాక క్లబ్ కార్యదర్శి కృష్ణ కుమార్, జీవర్‌బాబు, అచ్యుతరావు, నున్నా శ్రీనివాసరావు, బోయిన బాబూరావు, తిప్పల అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కల్ సమాజ్ నూతన కార్యవర్గం

బీచ్‌రోడ్డు: ఉత్కల్ సంస్కృతిక సమాజ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. సిరిపురంలోని ఉత్కల్ సమాజ్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా జె.కె.నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె.కె.పది, కార్యదర్శిగా బిమిల్ కుమార్ మహంత్, ట్రెజరర్‌గా మహేశ్వర బెహరతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం ఏడాది పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలిపారు.

కాలువలకు కొత్త రూపు

- సాఫీగా మురుగునీరు ప్రవాహం



76వ వార్డు గాంధీనగర్‌లో కొత్తగా నిర్మించిన కాలువ



65వ వార్డు వికాస్‌నగర్ దోబీఘాట్ గెడ్డకు నిర్మించిన రక్షణ గోడ

పెదగంట్యాడ : గతంలో కాలువలు ఛిద్రం కావడంతో ఎక్కడికక్కడే మురుగునీరు నిల్వ ఉండిపోయేది.. అంతేకాకుండా చిన్నపాటి వర్షానికే మురుగునీరు మొత్తం రోడ్లపైకి వచ్చేసేది. దీంతో దుర్వాసన భరించలేక స్థానికులు నరకయాతన అనుభవించేవారు. పాదచారులు, వాహనచోదకులు అవస్థలు పడేవారు. మురుగునీటిలో నుంచే రాకపోకలు సాగించేవారు. గెడ్డలకు రక్షణ గోడలు లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు అటుగా రాకపోకలు సాగించే వారంతా అందులో పడిపోయేవారు. దోమలు కూడా ఇక్కడే వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేసేవి. జనం వ్యాధులతో సతమతమై ఆస్పత్రులకు పరుగులు తీసేవారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. అన్ని ప్రాంతాల్లో మురుగునీటి కాలువలను కొత్తగా నిర్మించారు. దీంతో మురుగునీరు ఎక్కడా నిలిచిపోకుండా సాఫీగా ప్రవహిస్తోంది. దీని కారణంగా దోమల బెడద తగ్గింది.. రోడ్లపైకి కూడా వాడుక నీరు రాకపోవడంతో ప్రయాణాలు కూడా సాఫీగా సాగిపోతున్నాయి.



74వ వార్డు దల్లివానిపాలెంలో కొత్తగా నిర్మించిన కాలువ

అన్ని వార్డుల్లోనూ కాలువల నిర్మాణం

జీవీఎంసీ జోన్ – 6, పెదగంట్యాడ మండలంలోని అన్ని వార్డుల్లో కాలువలు, గెడ్డల రక్షణ గోడలు నిర్మించారు. గతంలో ఈ కాలువలు ఛిద్రం కావడంతో జనం అవస్థలు పడేవారు. ఇళ్ల ముందే మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన భరించలేకపోయేవారు. తమ ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమయ్యేవారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనలో మండలంలోని గాంధీనగర్, హెచ్‌బీ కాలనీ, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, రామచంద్రగనగర్, రిక్షా కాలనీ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేశారు.

- జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని బాపూజీ కాలనీ, వికాస్‌నగర్ దోబీఘాట్, బాపూజీ కాలనీ పాఠశాల సమీపంలోని శ్మశానం వద్ద గల డ్రెయిన్ రూ.99.23 లక్షలతో నిర్మించారు.



జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్‌లో కొత్తగా నిర్మించిన కాలువ

- జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని గాంధీనగర్‌లో అంబికా రెసిడెన్సీ నుంచి గాంధీనగర్ వరకూ, అలాగే శెట్టిబలిజ వీధి నుంచి హెచ్‌బీ కాలనీ వరకూ రూ.16.40 లక్షలతో కాలువలు నిర్మించారు.
- జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని గాంధీనగర్ శివాలయం పక్కన, నడుపూరు ఆర్యవైశ్యల వీధి, శెట్టిబలిజ వీధిలో రూ.15 లక్షలతో కాలువలు నిర్మించారు.
- జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దల్లివానిపాలెంలో రూ.8 లక్షలతో సీసీ కాలువలు నిర్మించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడు మల్లికేశ్వరరావును సన్మానిస్తున్న టైలర్లు

అక్కిరెడ్డిపాలెం : శ్రీ వినాయక దుర్గా టైలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల సోనియా టైలర్స్ షాపులో ఆదివారం న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అతికిసెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడిగా పుప్పాల వెంకటరమణ, అధ్యక్షుడిగా కూనూరు మల్లికేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా చిన్నారావు, కొలగాని శ్రీనివాసరావు, కార్యదర్శిగా కోడి గోవిందరావు, కోశాధికారిగా కుడుపూడి శ్రీనివాస్, సలహాదారులుగా బొడ్డు సాంబశివరావు, దొడ్డి శ్రీను, చేబ్రోలు త్రినాథ్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.శ్రీనివాస్, కనకేశ్వరరావు, రమణ, కృష్ణ, సత్తిబాబు, సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మల్లికేశ్వరరావును టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలందజేసి అభినందనలు తెలిపారు.

బాధితుడికి నిత్యావసర సరకుల అందజేత



రమేష్‌కు నిత్యావసరాలు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పెదగంట్యాడ : కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశాఖ పెయింటింగ్ కాంట్రాక్ట్ అండ్ పెయింటర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు టోనీ బెహరా, కనకారావు అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని మదీనా బాగ్‌కు చెందిన బి.రమేష్ అనే వ్యక్తి 74వ వార్డు పరిధిలోని సిద్దేశ్వరంలోని ఓ భవనంలో పెయింటింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. దీంతో గాయపడిన అతడిని అసోసియేషన్ సభ్యులు ఆదివారం పరామర్శించారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీఆర్ కృష్ణ, చలపతి పాల్గొన్నారు.

ఘనంగా ఎర్నిమాంబ జాతర



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు



మూలవిరాట్ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ఆలయం వద్ద భక్తుల సందడి

కంచరపాలెం : జ్ఞానాపురం, అల్లిపురం ప్రజల ఇలవేల్పుగా కొలిచే ఎర్నిమాంబ అమ్మవారి జాతర ఆలయ ఈవో డీవీవీ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి బారులుతీరారు. అమ్మవారిని దర్శించుకుని.. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పూలఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూలవిరాట్‌ను వేలాది మంది భక్తులు సుమారు 252 అమ్మవారి ప్రతిమలతో దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పలు సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ చైర్మన్, సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణ తులసీదళార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి108 స్వర్ణ తులసీదళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ఆరిలోవ: ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. రెండేళ్లకు ఒకసారి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా కాలపరిమితి పూర్తికావడంతో పాత కార్యవర్గం ఇటీవల రద్దయింది. దీంతో అసోసియేషన్ సభ్యులు ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు అధ్యక్ష పదవికి పోటీలో నిలవడంతో ఎన్నికల పరిశీలకులుగా అల్లంపల్లి రాజబాబు, కొరికాన మోహనరావు, పి.వెంకటేశ్వరరావు వ్యవహరించి పోలింగ్ చేపట్టారు. ఈ పోలింగ్‌లో అధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు, కోశాధికారిగా సీహెచ్.సత్యనారాయణ ఎన్నికయ్యారు. వారిరువురు ఇతర సభ్యులతో కలిసి ప్రధాన కార్యదర్శిగా ఎన్.రవికుమార్‌ను నియమించారు. గౌరవాధ్యక్షులుగా కె.మోహనరావు, సి.సాయికుమార్, ముఖ్య సలహాదారుగా ఎ.రాజబాబు, సలహాదారుగా జి.విక్టర్, ఉపాధ్యక్షులుగా రమణ, చిన్నను నియమించారు. నూతన కార్యవర్గానికి అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని కార్యవర్గ సభ్యులు హామీ ఇచ్చారు.

నిరాడంబరతకు నిదర్శనం పుచ్చలపల్లి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న దాస్

ఉక్కునగరం: రాజకీయాల్లో నిరాడంబరతకు నిదర్శనం పుచ్చలపల్లి సుందరయ్య అని స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి.దాస్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభలలో ప్రజావాణిని వినిపించిన మహానేత సుందరయ్య అన్నారు. సుందరయ్య జీవితకాలం అంతా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తపన పడే వారన్నారు. ఆయన సిద్ధాంతాలను అనుసరించడమే ఆయనకిచ్చే ఘన నివాళి అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు పి.రాము, స్టీల్ సిటు ప్రతినిధులు కె.పి.సుబ్రహ్మణ్యం, కె.బాలశౌరి, మొహిద్దీన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు

అగనంపూడి : వందలాది మంది వాకర్లకు అనుగుణంగా ఏర్పాటు చేసిన అగనంపూడి వాకింగ్ ట్రాక్‌లో కనీస వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని విశాఖ ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు అన్నారు. అగనంపూడిలోని ఉక్కు జనరల్ ఆస్పత్రి రహదారిలో ఉన్న వాకింగ్ ట్రాక్ వద్ద వాకర్స్ క్లబ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉండడం వల్ల వాకర్స్‌తో పాటు ఈ మార్గంలో ప్రయాణించే వేలాది మంది దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఉక్కు యాజమాన్యంతో చర్చించి వాకింగ్ ట్రాక్‌లో హైమాస్ట్ దీపాలు అమర్చనున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో వాకింగ్ ట్రాక్ దెబ్బ తినకుండా ఉండేందుకు వాకింగ్ ట్రాక్‌లో వర్షం నీరు నిలిచిపోకుండా కాలువ ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్‌లో కనీస వసతులు కల్పించడానికి చొరవ తీసుకుంటున్న వాడచీపురుపల్లి పంచాయతి కార్యదర్శి, వాకర్స్ క్లబ్ ప్రతినిధి మురళీధర్‌ను సత్కరించారు. అలాగే చలివేంద్రం ఏర్పాటునకు సహకరించిన ఉక్కు విశ్రాంత జనరల్ మేనేజర్ జి.అర్జునరావు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మడగల నరసింగరావు, బెక్కం రామారావు, గవర సోమశేఖర్, బలిరెడ్డి సత్యనారాయణ, కరణం పైడిరాజు, కాకినాడ శ్రీను, చిన్ని పూర్ణ పాల్గొన్నారు.

బయోమెట్రిక్‌తో బాగోతం బట్టబయలు

అగనంపూడి : విశాఖ ఉక్కు కర్మాగారంలో బయోమెట్రిక్ హాజరు అమలుతో కాంట్రాక్టర్ల బాగోతం బయట పడుతోందని సమాచార హక్కు చట్టం కార్యకర్త, విశాఖ ఉక్కు కార్మిక సంఘం మాజీ నాయకుడు పట్టా రామ అప్పారావు ఆరోపించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్రపతి, సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బయో మెట్రిక్ విధానం అమలు కాని రోజుల్లో ఒక కాంట్రాక్టర్ పేరుతో రెండు మూడు పనులకు కాంట్రాక్ట్ పొందుతూ ఒక చోట పని చేసే కార్మికుల్నే రెండు మూడు చోట్ల పని చేస్తున్నట్టు చూపించి బిల్లులు దండిగా వసూలు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. బయోమెట్రిక్ అమలు చేసిన తర్వాత సుమారు ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు తక్కువగా జాబితాలో కనపడుతుందని, అయితే ఈ ఐదువేల మందిని తొలగించారా, లేక రెండు మూడింతల జాబితాతో ఉక్కు యాజమాన్యాన్ని బోల్తా కొట్టించారో వాస్తవాలు బయట పడాలంటే పది సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేసిన వారి ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి రికార్డులు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.రమేష్‌కుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు పంకజ్, కీర్తి

పెదగంట్యాడ : జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని సమతానగర్‌లో గల షిర్డీ శాంతిధామం ఆవరణలో ఆదివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కమిటీ సభ్యులు బి. సత్యనారాయణ, ఎన్. లక్ష్మణరావు ఆధ్వర్యంలో వేద్ నేత్రాలయ సూపర్ స్పెషాల్టీ ఐ కేర్ ఆస్పత్రి సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మందికి డాక్టర్ పంకజ్ డోంగ్రే, డాక్టర్ బెల్లాల కీర్తి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కీర్తి మాట్లాడుతూ ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి ఈ నెల 25వ తేదీలోపు తమ వేద్ నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ ఆస్పత్రిలో మరోసారి ఆధునిక పరికరాలతో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లాల జోగారావు, మొగలపల్లి త్రిమూర్తులు, వైవీ రమణ, పి. సత్యనారాయణ, కె. సత్యంబాబు, వి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా బల్లిగిరి వెంకన్న వార్షిక తిరు కల్యాణం
- బల్లిగిరిపై మార్మోగిన గోవింద నామస్మరణ



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి



కన్యాదానంలో పాల్గొన్న ఈవో రమాబాయి, ధర్మకర్తల మండలి చైర్మన్ బొడ్డేటి కిషోర్



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. చిరు మొగ్గల సిగ్గులొలికే బుగ్గలతో, పసిడి కాంతులీనుతూ.. పెండ్లి కూతుళ్లుగా, బుగ్గన చుక్కతో దేవేరులు శ్రీదేవీ, భూదేవీల మధ్య ముగ్ధ మనోహర రూపంలో కాంతులీనుతున్న వెంకన్న స్వామి కల్యాణ వైభోగం చూసిన వారు ధన్యులయ్యారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అంకురార్పణ, గరుడ పతాక ధ్వజస్తంభ అధిరోహణ, విశేష హోమాలను ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి తిరుకల్యాణోత్సవం సందర్భంగా తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ తరఫున ఆలయ ఈవో జీవీ రమాబాయి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు గొడవర్తి రఘునాథశర్మ పర్యవేక్షణలో ఆగమ పండితులు స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న జంటలు కల్యాణం జరిపించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. అనంతరం కల్యాణ దంపతులను వేదపండితులు ఆశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.